# పుస్తక సమీక్ష

## వెంటాడే కథనం



**కథ...** ఇది లేకపోతే జీవితం లేదు, నాటకం లేదు, సినిమా లేదు, పుస్తకం లేదు, వెబ్ పత్రికా లేదు. ఈ 24 కథల పుస్తక సంకలనం పేరు 'వెంటాడే కథలు'. పేరు వినగానే 'ఏదైనా క్రైమ్, డిటెక్టివ్ బాపతు కథల సంకలనమేమో!' అనుకొన్నాను. తీరా పుస్తకం చేతికి తీసుకున్నాక, పేజీకి పేజీ తిరగేసి వరసగా చదవడం మొదలెట్టాను. అప్పుడు అర్థమైంది ఈ సంకలనానికి ఆ పేరు ఎందుకు పెట్టారో! ఇందులో తెలుగు, ఒరియా, బెంగాలీ, హిందీ, తమిళం, గుజరాతీ, సింధీ, కాశ్మీరీ, కన్నడ వంటి భారతదేశ కథలే కాకుండా, జర్మన్, ఆఫ్రికన్, ఫ్రెంచ్, హంగేరి, బెల్జియం, చైనీస్, పాకిస్తానీ వంటి విదేశీ కథలనూ స్పృశించారు రచయిత చంద్ర ప్రతాప్ కంతేటి. ఈ పుస్తకంలో ప్రతి కథను ఆయన గుర్తుంచుకొన్నంతవరకు స్పష్టంగా వివరిస్తూ, ముగింపులో ఆ కథను విశ్లేషించడం కొసమెరుపు. ఇక ఈ 24 కథల గురించి చెప్పాల్సి వస్తే, ప్రతి కథా ఏదో ఒక విశేషాన్ని కలిగి ఉంది. 'ప్రొఫెసర్ గారి స్వయంకృతం' కథలో వృద్ధాప్యంలో ప్రొఫెసర్ లాంటి ఒంటరితనాన్ని అనుభవించే వాళ్లెందరో మనకు కనిపిస్తారు. దశాబ్దాలనాటి కథ ఇది. కానీ నేటికీ నడుస్తున్న చరిత్ర. 'అవినీతి' అంశంతో వచ్చిన రెండో కథ కూడా నేటికీ సమాజంలో మనకు తెలిసినా, తెలియకపోయినా జరుగుతున్న యదార్థగాథే. 'మట్టిమనిషి' కథాంశం కూడా వృద్ధాప్యంలో సమస్యే. 'మాయా మకరి' కథ డబ్బే చోదక శక్తి అనే దానిచుట్టూ జరిగే అరాచకాలను కళ్లకు కట్టినట్లు వర్ణిస్తుంది. మానవీయతను చాటిచెప్పే కథ 'హ్యాపీ టైమ్స్'. ఈ చైనీస్ కథ సినిమాగా వచ్చింది. యూట్యూబ్‌లో కూడా లభ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ 24 కథల నేపథ్యం నిత్య యవ్వనంగా ఉండి, అందరినీ అలరిస్తాయి.

**వెంటాడే కథలు**

**రచయిత:** చంద్ర ప్రతాప్ కంతేటి
**పేజీలు:**168, **ధర:** రూ.250
**ప్రతులకు:** తపస్వి మనోహరం
**ఫోన్:** 7893467516

... డా||వి.వి. వేంకటరమణ

## సీతాన్వేషణ క్లుప్తంగా..!



**రామాయణం** అంటే... దండకారణ్యంలో అపహరణకు గురైన సీతమ్మవారి జాడ కనుక్కోవడమే. తప్పిపోయిన సీతను కనుక్కోవటానికి రాముడు ఎంతగానో ప్రయత్నించాడు. దుర్గమమైన అడవుల్లో తమ్ముడు లక్ష్మణుడితో కలిసి సంచరించాడు. చివరికి సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన వానరులతో కలిసి లంకా నగరంలో రావణుడి అశోకవనంలో బందీగా ఉన్న సీతమ్మను విడిపించుకున్నాడు. అయోధ్యకు తెచ్చుకున్నాడు. ఈ వృత్తాంతం స్ఫూర్తిగా హనుమంతుడు సీతమ్మవారి జాడను కనిపెట్టే వరకు గల రామాయణ ఘట్టాలను వాల్మీకి మహర్షి మార్గంలో క్లుప్తంగా అలతి అలతి పదాలతో 228 ఆటవెలది, తేటగీతి ఛందస్సులో ఆచార్య అనుమాండ్ల భూమయ్య 'సీతాన్వేషణము' పేరుతో రమ్యంగా రచించారు. ఎన్ని రామాయణాలు వచ్చినా దేని ప్రత్యేకత దానిదే అన్నట్టు... భూమయ్య 'సీతాన్వేషణము' కూడా ఆ కోవలోదే.

**సీతాన్వేషణము**

**రచన:** ఆచార్య అనుమాండ్ల భూమయ్య
**పేజీలు:** 118; **ధర:** రూ. 100
**ప్రతులకు:** **ఫోన్:** 88970 73999

## పీవీ స్మృతి వనమాలిక



**సమస్త జీవరాశికి చెట్లే జీవనాధారం. ఒక్క విత్తనం నాటితే అది వృక్షంగా మారి తీయని ఫలాలను మనకు ఇస్తుంది. ఆకలి తీర్చి, ఔషధంగా మేలు చేస్తుంది! అలాంటి ఔషధ తరువులకు ఆలవాలం 'పీవీ నరసింహారావు ఔషధ వనం'. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోలికట్ట గ్రామంలో ఉన్న ఈ వనంలోని ఔషధ వృక్షాల విశేషాలు ఇక వారం వారం.**

### చేదు మాను.. చేసేది మేలు..

మండు వేసవిలో వేపచెట్టు కింద సేదతీరితే చల్లగా ఉంటుంది. ప్రతి తెలుగు ఇంటి ముందూ వేపచెట్టు ఉంటుంది. వేపచెట్టు లేని వీధి ఏ ఊరిలోనూ ఉండదు. వేపచెట్టు శాస్త్రీయనామం 'అజాడిరక్టా ఇండికా'. సామాన్యుల భాషలో 'శ్రీ మహాలక్ష్మి స్వరూపం'. మా స్వగ్రామం వంగరలో మా ఇంటిముందు వందేండ్లకు పైబడ్డ పెద్ద వేపచెట్టు ఉండేది.

వేపచెట్టు ఔషధ గని. వేపలో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ లక్షణాలు ఉంటాయి. అందుకే దీన్ని సర్వరోగ నివారిణిగా పేర్కొంటారు. వేపగింజలు, పండ్లు, ఆకులు, పువ్వులు, బెరడు .. ఇలా అన్ని రకాల శాఖీయ భాగాలూ ఓషధులకు నెలవే. ఉదయమే వేపపుల్లతో దంతధావనం అలవాటు ఇప్పటికీ కనిపిస్తుంది. పరగడుపున రెండు లేత వేపాకులు తింటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుందని పెద్దలమాట. మశూచి సోకినప్పుడు వేప ఆకులు దగ్గర ఉంచేవారు. ఈ ఆకుల గాలితో చర్మం మీద పొక్కులు, మంట ఉపశమిస్తుంది. మశూచి తగ్గిన తర్వాత చర్మ సంరక్షణ కోసం నూరిన వేపాకులో పసుపు కలిపి ఒళ్లంతా పులిమి స్నానం చేయించేవారు. ఇలా చేయడం వల్ల చర్మం మీద పొక్కులు, మచ్చలు ఏర్పడవు. చర్మం పూర్వంలా కాంతిమంతంగా ఉంటుంది. యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉన్నందువల్ల చాలా రోగాల నివారణకు వేప ఆకు రసం తాగుతారు. చర్మవ్యాధులు, ఊబకాయానికి ఇది దివ్యమైన ఔషధం.

సాగులో చీడపీడల నివారణకు ఉపయోగించే రసాయనిక పురుగుమందుల వల్ల పర్యావరణానికి, అలా పండిన ఆహారం తినేవాళ్లకు, సాగు చేసే రైతులకు హాని జరుగుతున్నది. ఈ ప్రమాదాన్ని నివారించాలంటే సేంద్రియ సాగువైపు మళ్లాలని అందరూ చెబుతున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే రైతుకు చీడల నివారణకు ఉన్న మొదటి దారి వేపగింజలతో తీసిన నూనె, వేపాకులతో చేసిన రసాలే. వేపచెట్టు బెరడు, పండ్లతో తయారుచేసిన వేప కేక్, వేపనూనె.. పంటలపై చీడపీడల నివారణకు ఉపయోగిస్తారు. ఇక పండుగల విషయానికి వస్తే.. ఉగాది పచ్చడిలో వేప చేదు కూడా రుచిగానే అనిపిస్తుంది. ఆషాఢమాసం బోనాల్లో వేపకొమ్మలు తప్పనిసరి. ఈ విధంగా మన సంప్రదాయంలో వేప విడదీయరాని భాగమైపోయింది.

**- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

(...13వ పేజీ తరువాయి)

**అది ఎవరు?**

**సమాధానం**

తేజస్వినే సూసైడ్ చేసుకొన్నది. తనను నిరాకరిస్తున్న స్నేహిల్‌ను ఈ కేసులో ఇరికించాలని అతని డ్రింక్‌లో మత్తుమందు కలిపింది. అలా తాను సూసైడ్ చేసుకొన్నాక కూడా అదే రూమ్‌లో స్నేహిల్ ఉండేలా చేసింది. ఇక, కుర్చీ, టేబుల్ సాయంతో ఉరేసుకొంటే సూసైడ్ అని తెలిసిపోతుందని పెద్ద ఐస్‌క్యూబ్‌ను ఆర్డర్ చేసింది. మెడకు ఉరి బిగించుకొంది. ఐస్ కరిగిపోయాక.. మెడకు ఉరిపడటంతో మరణించింది. ఐస్ కరగడంతోనే గదిలో ఫ్లోర్ కార్పెట్ పచ్చిగా మారింది. కాగా, తేజస్విని ఐస్ ఆర్డర్ చేసిన రసీదు కూడా ఆమె గదిలో దొరకడంతో స్నేహిల్ బయటపడ్డాడు.